క్లుప్తంగా

పది పరీక్షలకు సర్వం సిద్ధం

పులిచెర్ల(కల్లూరు): ఈనెల 17 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు మండల విద్యాశాఖాధికారులు సిద్ధరామయ్య, తాతయ్య తెలిపారు. మండలంలోని కల్లూరు, పులిచెర్ల, మంగళంపేట ఎల్లంకివారిపల్లె, కావేటిగారిపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి ఈ ఏడాది పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు 313 మంది రాయనున్నారని వారు పేర్కొన్నారు. మండలంలోని కల్లూరు, మంగళంపేట పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తిచేయడంతోపాటు పరీక్ష కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్లకు బహుమతులు



డ్రైవర్‌కు బహుమతి ఇస్తున్న డీఎం

పుంగనూరు: స్థానిక ఆర్టీసీ డిపోలో ఇంధనం పొదుపులో అత్యంత కృషి చేసిన డ్రైవర్లు కె.అన్వర్, డీఏ ఖాన్, చక్రపాణి, దామోదర్‌రెడ్డిలకు బహుమతులను పంపిణీ చేశారు. గురువారం మేనేజర్ సుధాకరయ్య ఆధ్వర్యంలో డిపోలో జరిగిన కార్యక్రమంలో డ్రైవర్లకు శాలువ కప్పి సన్మానించారు. ఇంధన పొదుపులో డ్రైవర్లు చూపుతున్న కృషి అభినందనీయమన్నారు. ట్రాఫిక్ సూపర్ వైజర్ సంధ్య, అసిస్టెంట్ మేనేజర్ సుధాకర్ పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ



తోఫా పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

పుంగనూరు: పట్టణంలోని 100 పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాను గురువారం పంపిణీ చేశారు. ముందుగా ముస్లిం పెద్దలు రంజాన్ ప్రార్థనలు నిర్వహించారు. పట్టణానికి చెందిన కేహెచ్‌కే ఫలాహ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.2 వేలు విలువ చేసే సరుకుల కిట్లను పంపిణీ చేశారు. ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ ట్రస్ట్ వ్యవస్థాపకుడు స్వర్గీయ హాఫీజ్‌ఖాన్ ఆశయాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. పేదలను ఆదుకునేందుకు పలువురు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సంస్థ సభ్యులు అబ్దుల్‌అలీమ్, కమాలుద్దీన్, నజీమా, ఇంతియాజ్, నూర్‌మహ్మద్, అహ్మద్‌ఖాన్, ఉస్మానుఖాన్, రియాజ్, వసివుల్లా పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీవారి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

పుంగనూరు: పట్టణంలో కోనేటి వద్దనున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం స్వామివారి కల్యాణం కనులపండువగా నిర్వహించారు. అలాగే రాత్రి స్వామివారిని గజవాహనంపై ఊరేగించారు. భక్తులు స్వామివారికి మంగళహారతులు ఇచ్చి దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం శ్రీవారికి రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ మునీంద్రబాబు తెలిపారు. అలాగే రాత్రి స్వామివారిని అశ్వవాహనంపై ఊరేగించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

హుండీల ఆదాయం రూ.4.24లక్షలు



కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

పలమనేరు: పట్టణంలోని శివాలయం, సత్యగంగమ్మ ఆలయాల్లో గురువారం జరిగిన హుండీల లెక్కింపులో ఆలయాలకు ఆదాయంగా రూ.4.24లక్షలు వచ్చినట్టు ఈఓ కమలాకర్ తెలిపారు. లెక్కింపులో ఆలయ అర్చకులు, పెద్దలు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

చౌడేపల్లె: మద్యం విక్రేతను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు గురువారం తెలిపారు. దిగువపల్లె పంచాయతీ కొలింపల్లెకు చెందిన మురళీకృష్ణ. ఇతని చిల్లర దుకాణం వెనుక మందు విక్రయిస్తుండగా సమాచారం మేరకు అక్కడికి వెళ్లి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. అతని వద్ద 15 క్వార్టర్ బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అరెస్ట్ చేసి పుంగనూరు కోర్టుకు తరలించగా న్యాయమూర్తి రిమాండుకు ఆదేశించినట్లు ఎస్ఐ తెలిపారు.

18 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 18 మందికి రూ.1.80 లక్షల జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్స్‌పల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి గురువారం తీర్పునిచ్చారు. ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

ఓటీపీనా.. చెప్పేదిలేదు పో!

- సర్వేల పేరిట ఓటీపీలడుగుతున్న సచివాలయ సిబ్బంది
- ఓటీపీ చెప్పలేమంటున్న జనం
- ఎక్కువైన సైబర్ నేరాలు
- తలలు పట్టుకుంటున్న సచివాలయ సిబ్బంది

పలమనేరు: గత ప్రభుత్వంలో ప్రజలకు ఎన్నో సేవలందించిన సచివాలయ వ్యవస్థ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్వీర్యమైంది. సచివాలయాల్లోని సిబ్బందిని రకరకాల సర్వేలకు మాత్రమే పరిమితం చేశారు. దీంతో సచివాలయాల్లో సేవలు ఆగిపోగా వీరు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి సర్వేలు చేస్తున్నారు. అయితే ఈ సర్వేలో భాగంగా ఇళ్లవద్దకెళ్లి ఆధార్ నంబర్, సెల్‌కు వచ్చిన ఓటీపీ చెప్పాలని సిబ్బంది అడగ్గానే జనం ఇవ్వడం లేదు. అసలే బ్యాంకు అధికారులు ఎవరికీ ఓటీపీలు చెప్పకండి అంటుంటే మీరు మాటిమాటికి వచ్చి ఎందుకు ఇలా ఓటీపీలు తీసుకుంటున్నారంటూ ప్రజల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో సర్వేలను సకాలంలో చేయలేక సచివాలయ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులేమో నిర్ణీత సమయంలో సర్వేలను చేయాల్సిందేనని గట్టిగా భీష్మిస్తున్నారు. ఫలితంగా సచివాలయ సిబ్బంది పరిస్థితి అడకత్తెరలో చిక్కుకున్న పోకచెక్క పరిస్థితిగా మారింది.



గ్రామాల్లో సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

పలమనేరు నియోజకవర్గంలో సచివాలయాల వివరాలు..

- 5మండలాలు, మున్సిపాలిటీలో కలిపి 108 సచివాలయాలు
- ఒక్కో సచివాలయంలో సిబ్బంది10 మంది దాకా
- మొత్తం సచివాలయాల్లో సిబ్బంది 1,100 మంది

ఇప్పుడు వీరి విధులేమంటే..?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 540 సేవల వ్యవస్థను ఆపేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు ఎటూలేదు. ప్రస్తుతం ప్రభుత్వ సంక్షేమ సామాజిక అభివృద్ధిలో సంతృప్తికర స్థాయిని తెలుసుకునే పలు రకాలు సర్వేలు సాగుతున్నాయి. ఇందులో ఆధార్ అథెంటికేషన్ కోసం సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీలను చెప్పాల్సి ఉంటుంది. దీంతోపాటు హౌస్‌హోల్డ్ జియోటాగింగ్, ఎంఎస్ఎంఈ(చిన్న, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలు)పై రుణాల సర్వే, ఎన్‌పీసీఐ లింకేజీ, ఆధార్‌తో బ్యాంకుఖాతాలు లింక్, ఇంటింటా ఆరోగ్యసర్వే, స్వర్ణపంచాయతీ డేటా ఎంట్రీ, ఆర్‌టీఎఫ్, ఎంటీఎఫ్ విద్యార్థులకు రుణాల సర్వే, పాఠశాలల విజిట్, టాయ్‌లెట్ల ఫొటోల అప్‌లోడింగ్, సంచారజాతుల సర్వేలతోపాటు ప్రతినెలా సామాజిక పింఛన్ల పంపిణీ విధులను చేపట్టాలి.

ససేమిరా కాదంటున్న జనం...

అసలే బ్యాంకుల్లోని డబ్బును కాజేసేందుకు ఎన్నో సైబర్ క్రైమ్‌లు సాగుతున్న నేపథ్యంలో ఇలా మాటిమాటికీ ఇళ్లవద్దకొచ్చి ఆధార్ చూపండి, సెల్‌కు ఓటీపీ వచ్చిందా దాన్ని చెప్పండంటూ తమ వ్యక్తిగత గోప్యతపై భద్రత లేకుండా పోయిందని జనం ప్రశ్నిస్తున్నారు. దీంతో సకాలంలో సర్వేలు ఎలా చేయాలో సచివాలయ సిబ్బందికి అర్థంకావడం లేదు. అధికారులేమో చెప్పిన సమయానికి సర్వేలు పూర్తికావాలని గట్టిగా ఆదేశిస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో ఓటీపీలను సేకరించడం సచివాలయ సిబ్బందికి పెద్దతలనొప్పిగా మారింది.

ఓటీపీలు చెప్పడం లేదు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేశారు. తమకు పలు రకాల సర్వేలను అప్పగించారు. అయితే ఇళ్లవద్దకెళ్లి ఆధార్ ఆథెంటికేషన్ కోసం ఓటీపీ చెప్పమంటే జనం చెప్పడంలేదు. ఎందుకు మా బ్యాంకుల్లో డబ్బును కొట్టేసేందుకా లేక మా వివరాలు మొత్తం తెలుసుకునేందుకా అని ప్రశ్నిస్తున్నారు. ఏమి చేయాలో అర్థం కావడం లేదు. ఇప్పటికైనా అధికారులు ఆధార్ ప్రామాణిక సర్వే విధానం పునఃపరిశీలించాల్సిన అవసరం ఉంది.

– మురళీనాథ్, సచివాలయ సంక్షేమసంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

అభివృద్ధికి సహకరించండి

పలమనేరు: సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆమేరకు పట్టణంలో ఆస్తి పన్నుకు సంబంధించి 2,998 మంది రూ.1.36 కోట్లు, నీటి పన్ను చార్జీలు 2,521మంది రూ. 62లక్షలు, ఖాళీ స్థలాలకు సంబంధించి 405 మంది రూ.48 లక్షలు బకాయిలున్నట్టు పేర్కొన్నారు. పన్నులు వెంటనే చెల్లించాలని ఆయన కోరారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం



గుడుపల్లె: మండలంలోని కాడేపల్లిలో వెలిసిన నాగదేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం శివపార్వతుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. వేదపండితులు శాస్త్రోక్తంగా మంగళవాయిద్యాల నడుమ కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారిని గ్రామంలోని పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామి వారి కల్యాణోత్సవానికి విచ్చేసి మొక్కులు తీర్చుకున్నారు.

క్రియేటివ్ కార్నర్ ల్యాబ్ ప్రారంభం

గుడుపల్లె: అగస్త్యా ఇంటర్‌నేషనల్ ఫౌండేషన్‌లో ఓపెన్ డేస్ సందర్భంగా గురువారం క్రియేటివ్ కార్నర్ ల్యాబ్‌ను ఎంఈఓ శ్రీదేవి ప్రారంభించారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ ప్రకారం సంఖ్యాశాస్త్రం అక్షరాస్యతను మోడల్స్ తయారు చేసి అందరికీ నేర్పించాలన్నారు. మోడల్ చెప్పే విద్యార్థులకు అగస్త్యా ఫౌండేషన్ సర్టిఫికెట్లను విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా 16 పాఠశాలల నుంచి వచ్చిన 726 మంది విద్యార్థులు 27 మంది ఉపాధ్యాయులు, 40 మోడల్స్‌ను పరస్పరం చర్చించుకున్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పాడి పశువులకు కృత్రిమ గర్భధారణ



మాట్లాడుతున్న కడా పీడీ

కుప్పంరూరల్: పాడి పశువులకు కృత్రిమ గర్భధారణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కడా పీడీ వికాస్ మర్మత్ కోరారు. గురువారం దాసేగౌనూరు గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఏర్పాటు చేసిన సమావేశంలో పీడీ మాట్లాడారు. పశుసంవర్ధకశాఖ, ఎన్‌డీడీబీ, రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో పేయ దూడలు పెట్టే విధంగా కృత్రిమ పద్ధతుల్లో ఇచ్చే కృత్రిమ గర్భధారణ పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీంతో పాడి రైతులకు అధిక లాభం కలుగుతుందన్నారు. పథకాన్ని కుప్పం రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. పశువైద్యులు డా.రెడ్డికుమారి, సతీష్‌కుమార్, సిబ్బంది, నేతలు ప్రేమ్‌కుమార్, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

సాంకేతిక పద్ధతులపై అవగాహన ఉండాలి

చౌడేపల్లె: రైతులు ప్రస్తుత కాలంలో సాంకేతిక పద్ధతులు, వాడుకపై అవగాహన కల్గి ఉండాలని ఏఓ జ్యోతమ్మ సూచించారు. గురువారం చౌడేపల్లె రైతు సేవా కేంద్రంలో రైతులకు స్కిల్ యాప్‌లపై శిక్షణ ఇచ్చారు. మాస్టర్ ట్రైనర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ రైతు సేవా సిబ్బంది, రైతులు వాతావరణ సమాచారంతోపాటు వ్యవసాయ పనులు చేసే విధానం ఆధునిక పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు సాధించే విధానం, మార్కెట్ సేవలు, డిజిటల్ చెల్లింపుల యాప్‌లపై శిక్షణ ఇచ్చారు. రైతులు ఆధునిక పద్ధతులను యాప్‌ల ద్వారా సందేహాలు నివృత్తి చేసుకోవచ్చునని తెలిపారు. మానిటరింగ్ ఆఫీసర్ శివప్రసాద్ పాల్గొన్నారు.



అవగాహన కల్పించి మొబైల్స్ చూపుతున్న సిబ్బంది, రైతులు

ఘనంగా మహిళా దినోత్సవం



సత్కారం అందుకున్న మహిళా టీచర్లు

చౌడేపల్లె: మండల కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని మహిళా టీచర్లు హాజరయ్యారు. ఎంఈఓ తిరుమలమ్మను ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఆమె మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. సమాజంలో మహిళలే కీలకమన్నారు. ఏ రంగంలో చూసినా మహిళలే నేడు ముందంజలో ఉంటూ సమాజంలో ఆదర్శ వనితలుగా రాణిస్తున్నారని తెలిపారు. ఎంఈఓ కేశవరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశం రేపు

పలమనేరు: మున్సిపల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి అధ్యక్షతన శనివారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ హాలులో నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మున్సిపల్ వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, ఎక్స్‌అఫిషియో సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని అందులో కోరారు.

రైతులకు డిజిటల్ శిక్షణ



అవగాహన కల్పిస్తున్న అధికారులు

సదుం: మండలంలోని రైతు సేవా కేంద్రంలో రైతులకు, కేంద్రం ఇన్‌చార్జ్‌లకు గురువారం డిజిటల్ అక్షరాస్యత, యాప్‌ల వినియోగంపై అవగాహన కల్పించినట్లు ఏఓ మాధవి తెలిపారు. ఏడీఏ శివకుమార్ స్మార్ట్ ఫోన్ ద్వారా మార్కెట్ ధరలు, వాతావరణం, పంటలు తెలిపే యాప్ వివరాలు, ఎరువుల కొనుగోలు, నగదు బదిలీపై శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. శిక్షణ సద్వినియోగం చేసుకొని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తెలిపామన్నారు. మాస్టర్ ట్రైనర్ అనిల్‌కుమార్, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్ వందశాతం చేయాలి

- డీఎంహెచ్‌ఓ సుధారాణి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌ను వందం శాతం పూర్తిచేయాలని డీఎంహెచ్‌ఓ సుధారాణి ఆదేశించారు. చిత్తూరులోని తన కార్యాలయంలో ఆమె గురువారం అధికారులతో సమీక్షించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన నివేదికలను ఎప్పటికప్పుడు పూర్తిచేయాలన్నారు. ప్రధానమంత్రి జన్ ఔషధి యోజన ద్వారా తక్కువ ధరకు అందే మందులు, మాత్రలను ప్రజలు వినియోగించుకునేలా చూడాలని తెలిపారు. నేషనల్ సికెల్ సెల్ అనిమీయా కింద నమోదైన వ్యక్తులకు అవగాహన కల్పించి ఉచిత వైద్యసేవలు అందించాలన్నారు. జిల్లా క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్, డీఐఓ హనుమంతరావు, డీఎంఓ వేణుగోపాల్, డాక్టర్లు గిరి, ప్రవీణ, అనూష, రామ్మోహన్, జయరాముడు పాల్గొన్నారు.

రేపటి నుంచి సీపీఎం ప్రజా చైతన్యయాత్ర



మాట్లాడుతున్న గంగరాజు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో ఉన్న స్థానిక సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో శనివారం నుంచి ప్రజా చైతన్య యాత్రలు నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి గంగరాజు తెలిపారు. గురువారం చిత్తూరులోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సమస్యలపై యాత్రలో వివరాలు నమోదు చేసుకుంటామన్నారు. ఈనెల 20 తర్వాత సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఒత్తిడి తెచ్చే దిశగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలవుతున్నా ఎక్కడి సమస్యలు అక్కడే రాజ్యమేలుతున్నాయని, పట్టించుకున్న పాపానపోవడం లేదని ఆరోపించారు. నాయకులు భువనేశ్వరి, సురేంద్రన్ ఓబుల్ రాజు, గిరిధర్‌గుప్తా పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశం నిర్వహించాలి

కుప్పం: మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు కమిషనర్ శ్రీనివాసులుకు విన్నవించారు. గత నాలుగు నెలలుగా కౌన్సిల్ సమావేశం నిర్వహించలేదని, దీంతో మున్సిపల్ అభివృద్ధి కుంటపడుతోందని వినతిలో పేర్కొన్నారు. ప్రతినెలా జరగాల్సిన కౌన్సిల్ సమావేశం నాలుగు నెలలుగా జరగకపోవడం వల్ల అభివృద్ధి పనులు ఆగిపోయాయని వారు అన్నారు. కౌన్సిల్ సమావేశం నిర్వహించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని వారు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, కౌన్సిలర్లు మోహన్‌రామ్, విజయ్‌కుమార్, గణపతి, సయ్యద్ ఆలీ, రాజ్‌కుమార్, నాగరాజ్ పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతి ఇస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

తీరిన నీటి కష్టాలు

శాంతిపురం: కడపల్లి పంచాయతీలోని పోడుచేన్లు గ్రామంలో రక్షిత మంచి నీటి బోరు మోటారు దెబ్బతిని రెండు వారాలుగా గ్రామస్తులు తాగునీటి కోసం తిప్పలు పడ్డారు. సమస్యను తెలుసుకున్న ఎంపీడీఓ రవికుమార్ తక్షణం సమస్యను తీర్చాలని పంచాయతీ కార్యదర్శి అంజాద్‌ను ఆదేశించారు. ఆ మేరకు మండల పరిషత్ నుంచి నిధుల విడుదలకు చర్యలు తీసుకోవడంతో గురువారం కొత్త మోటారును బోరుకు అమర్చి గ్రామానికి నీటి సరఫరాను పునరుద్ధరించారు.



కొత్త మోటారును అమర్చుతున్న సిబ్బంది

టైలరింగ్ శిక్షణకు దరఖాస్తులు

పెద్దపంజాణి: మండల పరిధిలో అర్హత కలిగిన ఈబీసీ, బీసీ, కమ్మ, రెడ్డి, ఆర్య, వైశ్య, కాపు, బ్రాహ్మణ, క్షత్రియ మహిళలకు టైలరింగ్‌పై బీసీ కార్పొరేషన్ ద్వారా శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీఓ బాలాజి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు 18–50 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, తెల్లరేషన్ కార్డు, ఆదాయ, కులధ్రువీకరణ, ఆధార్ కార్డు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఒక కుటుంబంలో ఒకరు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పైన తెలిపిన అర్హతలు కలిగిన వారు సంబంధిత సచివాలం పరిధిలో పేర్లు నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు.

కదిరిముత్తనపల్లెలో పెద్దదేవర సందడి



భీరేశ్వర, చెన్నకేశ్వర, సిద్ధేశ్వర, బత్తేశ్వర, రేవణ సిద్ధేశ్వర స్వాములు

శాంతిపురం: తొమ్మిదేళ్లకు ఓ సారి జరిగే కురబ కులస్తుల పెద్దదేవర సందర్భంగా భక్తుల రాకతో కొలమడుగు పంచాయతీలోని కదిరిముత్తనపల్లెలో సందడి నెలకొంది. గురువారం శ్రీ సిద్ధేశ్వరస్వామి, శ్రీ భీరేశ్వరస్వామి, శ్రీ రేవణ సిద్ధేశ్వరస్వామి, శ్రీ బత్తేశ్వరస్వామి, శ్రీ చెన్నకేశ్వరస్వాములకు పంచామృత అభిషేక అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉదయం తమటమొద్దు పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కదిరిముత్తనపల్లి దారుల్లో వాహనాలు బారులు తీరాయి. మూడు రోజుల పాటు పూజల కోసం 2 వేల కుటుంబాలు ఇక్కడికి వచ్చి టెంట్లు వేసుకోవడంతో ఆలయం నుంచి కిలోమీటరు వరకూ షామియానాలు, వాహనాలతో నిండిపోయాయి. శుక్రవారం తలలపై కొబ్బరికాయలు కొట్టే కార్యక్రమం ఉండడంతో దీనికి 4 లక్షల మంది జనం వస్తారని ఆలయ ధర్మకర్త మునిరత్నంగౌడు చెప్పారు. ఉత్సవాలకు సీఎం సతీమణి భువనేశ్వరి శనివారం వస్తున్న నేపథ్యంలో పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాట్లు చేశారు.



ఆలయ ఆవరణలో జనసందోహం

మురుగు పైనే భక్తుల అవస్థల ప్రయాణం

ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు వస్తారంటున్న కదిరిముత్తనపల్లి ఉత్సవాలకు సరైనా రవాణా మార్గాలు లేకపోయాయి. నల్లరాళ్లపల్లిలో రోడ్డుపై పారుతున్న మురుగునీటి మీదుగానే భక్తులు కదిరిముత్తనపల్లి ఆలయానికి చేరుకోవాల్సి వస్తోంది. విస్తృత ఏర్పాట్లు చేశామంటున్న అధికారులు ఈ చిన్న విషయాన్ని కూడా పట్టించుకోలేదని భక్తులు మండిపడుతున్నారు. దండికుప్పం రోడ్డు నుంచి నల్లరాళ్లపల్లి మీదుగా వెళ్లే రోడ్డుకు ఇరువైపులా కొత్తగా మట్టి తోలే సందర్భంలో సిమెంటు, తారు రోడ్లపై పోసిన మట్టిని తొలగించకపోవడంతో భారీ ఎత్తున దుమ్మురేగుతోంది. మరోవైపు వందలాది వాహనాలు రావడంతో ఇరుకు రోడ్డుపై ఇక్కట్లు తప్పలేదు. శుక్రవారం పదింతల సంఖ్యలో వాహనాలు వస్తాయని అంచనా వేస్తున్న నేపథ్యంలో ట్రాఫిక్ కష్టాలు మరింత తీవ్రం కానున్నాయి.